క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పాన్‌గల్: ప్రభుత్వం బీసీ కుల, చేతి వృత్తుల వారికి అందజేసే రూ.లక్ష సాయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీల్లో 15 కులాల వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని, వారందరూ 18ఏళ్ల నుంచి 55ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని, ఇప్పటి వరకు కార్పొరేషన్ల ద్వారా ఎలాంటి లబ్ధి పొంద కూడదని, కుటుంబంలో ఒక్కరికి అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



పాన్‌గల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల సంబరాల సమావేశంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అందజేసినట్లు తహసీల్దార్ చక్రపాణి పేర్కొన్నారు. 61 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు.

ఆధార్ క్యాంప్ నిర్వహణ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని తపాలా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆధార్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం సబ్ పోస్ట్ మాస్టర్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆధార్ ప్రత్యేక శిబిరంలో మొబైల్ నంబర్, ఈమెయిల్, బయోమెట్రిక్ అప్డేట్ కింద ఫొటో మార్పిడి, చేతి వేలిముద్రలు, ఐరిస్ స్కాన్ చేయబడుతుందని, ఈ అవకాశాన్ని ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



ఖిల్లాఘనపురం: నాగార్జున హైస్కూల్ వ్యవస్థాపకుడు బలిజపల్లి నాగభూషణం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందించిన బట్టలు, టిఫిన్ బాక్సులను మండల కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులకు జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, సామాజిక కార్యకర్త కమ్మరి గోపి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవితేజ, ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు జమున మధు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బుగ్గపల్లితండా ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతు పనులకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేసినట్లు ఎంపీపీ మేఘారెడ్డి తెలిపారు. నిధుల ప్రొసీడింగ్ కాపీని శుక్రవారం తండావాసులకు ఎంపీపీ మేఘారెడ్డి అందజేశారు. పాఠశాల భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ఎంపీపీ మేఘారెడ్డికి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, తిరుపతిరెడ్డి, వెంకటయ్య, బాలరాజు, తిరుపతయ్య, వెంకటేష్, శివయాదవ్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లపై చిన్నచూపు తగదు

పెబ్బేరు: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో ప్రభుత్వం ముదిరాజులను అవమానించిదని, ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష ఆర్థికసాయంలో వారిని నిర్లక్ష్యం చేసిందని శుక్రవారం ముదిరాజ్ సంఘం నాయకులు గోల్డ్ బాలస్వామి ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ముదిరాజ్‌లను రూ.లక్ష ఆర్థిక సాయం అందించే జాబితాలో చేర్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని, ప్రస్తుతం ఈ పథకాన్ని నిలిపివేయాలని లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్ గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన బోయ చిన్న అంజన్న శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని ఊక చెట్టువాగునుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ట్రాక్టరును పట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపాడు. ఎవరైన అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య



కొత్త సూగూర్‌లో..



ఆత్మకూర్‌లో వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, ప్రైవేట్‌కు దీటుగా విద్యా బోధన చేపడుతున్నామని ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ సామ్యరాణి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో బడి బయటి విద్యార్థుల వివరాలను నమోదును ముమ్మరంగా చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా ఇంగ్లిష్ మీడియం బోధన చేపడుతున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లకు పంపించాలని అభ్యర్థించారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

పెబ్బేరు: మండలంలోని కొత్త సూగూర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు పంపిణీ చేయడంతో పాటు అన్ని రకాల క్రీడలు, సౌకర్యాలు ఉంటాయని తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఊరూరా బడిబాట కార్యక్రమం

పెంట్లవెల్లి: మండలంలో కొద్ది రోజులుగా పెంట్లవెల్లి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి గ్రామంలో తిరిగి ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం చేపట్టారు. మండలంలోని పలు గ్రామాలు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, పాఠశాలలోని వసతులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా డిజిటల్ క్లాస్‌లు, ఎల్‌ఈడి టీవీలు, మధ్యాహ్న భోజన పథకం, పుస్తకాల పంపిణీ వంటి ఎన్నో వసతులను తెలంగాణ ప్రభుత్వం కల్పించిందని, బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు బలరామకృష్ణారావు, నర్సింహ, విజేందర్, శ్రీను, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లేశ్వరంలో బడిబాట కార్యక్రమం చేపట్టిన పెంట్లవెల్లి ఉపాధ్యాయులు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలో 30ఏళ్లగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా 11వ పీఆర్సీ కమిషన్ సిఫారసు చేసిన వేతనాలు రూ. 19 నుంచి 30 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఏడాదికి మూడు జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వడంతో పాటు వయసు మీరిన వారిని తొలగిస్తే కుటుంబంలో వారసులకు ఉద్యోగం, రిటర్మెంట్ బెనిఫిట్‌గా రూ. 10 లక్షలు, 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని కోరారు. ఆదివారం, పండుగ సెలవులు చేయాలని, అలాగే మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యత ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటయ్య, శివ, ఆనంద్, రాజు, ఎర్రన్న, సత్తిరెడ్డి ప్రసాద్, నోవెల్, లక్ష్మి, శిరీష, సరళ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి



గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

పాన్‌గల్: గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వైద్యుల సూచన మేరకు మందులను వాడుతూ పౌష్టికాహారంను తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో పేర్లు నమోదు చేయించుకున్న గర్భిణులను ఇంటి నుంచి పీహెచ్‌సీకి వాహనంలో తీసుకొచ్చి వైద్య పరీక్షల అనంతరం మళ్లీ ఇంటి వద్ద చేర్చేలా ప్రభుత్వం వాహనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం



బాలస్వామి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన వాకిటి బాలస్వామి అనారోగ్యం బారిన పడడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ముఖ్యమంత్రి సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానరు. వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి కృషితో మంజూరైన రూ.2.5 లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం మంత్రి, కలెక్టర్‌తో కలిసి బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు భార్గవ్, విష్ణు, పరమేష్, రాఘవేందర్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం



దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందిస్తున్న వెంకటయ్య

అమరచింత: దివ్యాంగులకు 50 శాతం రాయితీతో కూడిన బస్‌పాస్ కోసం దివ్యాంగులు జిల్లా కేంద్రానికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకటయ్య దరఖాస్తు ఫారం తనకు అందిస్తే బస్‌పాస్‌లు తెచ్చి ఇస్తానని మండల దివ్యాంగులకు భరోసా ఇస్తున్నాడు. వేసవి ఎండలతో పాటు ఇతర సమస్యలతో బస్‌పాస్ కోసం ఇబ్బందులు పడుతున్న వారందరూ సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫొటోను అందించిన రెండు రోజుల వ్యవధిలో బస్‌పాస్ అందించే వీలుందన్నారు. జిల్లా ఆర్టీసీ అధికారులు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల సౌకర్యార్థం తన వంతు సేవ చేయనున్నాని వెల్లడించారు. మరింత సమాచారం కోసం ఫోన్ 7680816340కు సంప్రదించాలని సూచించారు.

‘క్షయ’ అనుమానితులపై సర్వే



అనుమానితులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో శుక్రవారం క్షయ వ్యాధి అనుమానితులపై సర్వే నిర్వహించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి రవీంద్రగౌడ్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ అయిన బాధితుడి ఇంటి చుట్టూ 40 ఇళ్లను ఆశాలు సందర్శించి, ఆ ఇళ్లలోని వారికి పరీక్షలు చేయాలన్నారు. చర్మం పైన స్పర్శ లేని మచ్చలు, దళసరి చర్మం ఉండడం, రాగి రంగులో మచ్చలు కలిగి ఉండడం, మోచేయి, మోకాలు, పాదం వద్ద నరాల వాపు కలిగి ఉండడం, కనుబొమ్మలపైన వెంట్రుకలు లేకపోవడం, అరికాళ్లపై పుండ్లు ఉండడం మొదలైన లక్షణాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు సురేష్‌గౌడ్, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశా కార్యకర్తలు భాగ్యరాణి, జిలేఖ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

ఆత్మకూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఆర్భాటంగా జరుపుకొంటున్న ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ప్రసాద్, జిల్లా నాయకుడు రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా కోటి ఉద్యోగాలు భర్తీ కాలేదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులైజేషన్ జరుగలేదని, డబుల్ బెడ్రూంఇళ్ల ఊసే లేదని, రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, నిరుద్యోగ భృతి లేదని, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని ఆరోపించారు. ధరణి వెబ్‌సైట్ అవకతవకలను సరిచేయాలని, పంటల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, బాలస్వామి, వెంకటేష్, రాములు, లక్ష్మణ్, వెంకటమ్మ, శిరీష, సుజాత తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సింధూజ

ఆత్మకూర్: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి నమోదు చేయించాలని సూచించారు. జూన్ 23 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని బూత్ లెవల్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐలు జయమ్మ, నర్సింహులు, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ



అలంపూర్: దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా శుక్రవారం సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. ఆడపిల్లల పెళ్లిల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా రూ.100116లు అందజేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రంలో 1050 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. కుల వృత్తుల వారికి ఒక్కొక్కరికి రూ. లక్ష వరకు అందిస్తోందన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

చెక్కుల అందజేత

అలంపూర్ నియోజవర్గంలోని 144 మహిళా సంఘాలకు రూ. 11.51 కోట్ల విలువ గల చెక్కులను మహిళా సంఘాలకు ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అందజేశారు. గొర్రెల పంపిణీ యూనిట్ల ప్రారంభించారు. మహిళా సంఘాల ద్వారా ఒక ట్రాక్టర్‌ను అందజేశారు. కులవృత్తుల వారికి రూ. ఒక లక్ష, పంపిణీ చేశారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ బీసమ్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, నాయకులు వెంకటేశ్వర్లు, వెంకట్రాముడు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

ఆత్మకూర్: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూర్‌లోని ఎస్టీయూ భవనం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లాకార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఎస్టీయూ ఎనలేని కృషి చేస్తుందన్నారు. సంఘం ఏర్పాటులో ముగ్దూం మోయినోద్దీన్ కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లోఉన్న డీఏ ఇవ్వాలని, మెడికల్, జీపీఎఫ్ బిల్లులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పెద్దమందడి మండల అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, గోపాల్‌పేట అధ్యక్షుడు నర్సింహారావు, కొత్తకోట అధ్యక్షుడు సురేష్‌కుమార్, నాయకులు సుశీలమ్మ, రియాజుద్దీన్, దోమశ్రీను, విజయప్రకాష్, శ్రీలత, అంజూమ్‌షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరు భాగస్వాములవ్వాలి



చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: సబ్బండవర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నారాయణపేట జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో రవి కన్వెన్షన్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురువ యాదవులకు గొర్రెలు, కులవృత్తులు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, కులాంతర వివాహాలు చేసుకున్న లబ్ధిదారులకు వారు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కులవృత్తులకు ప్రతి ఒక్కరికి రూ.లక్ష అందిస్తుందన్నారు. అభివృద్ధిలో అందరు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, జెడ్పీటీసీలు అశోక్‌గౌడ్, వెంకటయ్య, ఎంపీపీలు వనజ, శ్యామలమ్మ, ఎల్కోటి లక్ష్మి, పూర్ణిమ పటేల్, జెడ్పీ సీఈఓ జ్యోతి, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావనీ, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి , బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు గడ్డం రమేష్, దత్తు, శివప్ప, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పేదల సంక్షేమమే లక్ష్యమని నారాయణపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అనుగొండలో ఎస్సీ కాలనీలో 35 మంది లబ్ధిదారులకు వారు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. ఎంపీపీ వనజ, సర్పంచ్ గడ్డం రమేష్, ఎంపీటీసీ పద్మ పాల్గొన్నారు.

గొల్లకురుమల సంక్షేమానికి కృషి

నర్వ: ప్రభుత్వం గొల్లకురుమల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్ర సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అన్ని కుల వృత్తులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం గొల్లకురుమలు గొంగడి, గొర్రెపిల్లతో ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచ్ శివన్న, ఉప సర్పంచ్ నాగరాజు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహా, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం ముఖ్యం



దేవరకద్రలో జరిగిన సంక్షేమ సంబరాలలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: రాష్ట్రం వచ్చాక అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం దేవరకద్ర మార్కెట్ యార్డులో జరిగిన సంక్షేమ సంబరాలలో ఎమ్మెల్యే మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16,021 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. 160 కోట్లు అందించామన్నారు. ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్ ద్వార 26 మందికి రూ.5.20 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. బీసీ ఎస్సీ మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. సెలూన్, లాండ్రీ, దోబీ ఘాట్‌లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని వివరించారు. అదేవిధంగా కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో నెంబర్ వన్‌గా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా 104 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యేతో కలిసి అందజేశారు. 32 మందికి ఇళ్లపట్టాలు అందించారు. కుల వృత్తులకు చెందిన నలుగురికి రూ. 4 లక్షలు అందజేశారు. కులాంతర వివాహం చేసుకున్న రెండు జంటలకు రూ. 2.50 లక్షల చొప్పున, అదేవిధంగా మహిళలకు రూ. 2.79 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీలు రమాదేవి, శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, నాయకులు, అధికారులు ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద శుక్రవారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వీక్షించారు. వీటితో పాటు వివిధ గ్రామాల్లోని జొన్నలబొగుడ గ్రామస్తులంతా కార్యక్రమానికి హాజరై ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను వీక్షించారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి



చెరువుల కింద సాగు చేసిన పంటల వివరాలు సేకరిస్తున్న ఏడీఏ రవి

కోడేరు: రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని ఏడీఏ రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 2022 విస్తీర్ణం కింద క్లస్టర్ పరిధిలో వ్యవసాయ బోరు బావులు, ఎరువులు, కుంటల కింద రైతులు సాగుచేసిన వాటిని పరిశీలించి మాట్లాడారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. వర్షాకాలంలో ప్రభుత్వం సూచించిన మేరకు 20 రోజుల ముందుగానే వరినాట్లు వేసుకోవాలని సూచించారు. రైతులు పంటలు సాగు చేసేటప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఏఈఓ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



సమావేశానికి ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: పేదల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్‌లోని మహెబూబ్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ట్రాక్టర్ నడుపుకొంటూ వచ్చారు. పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కొల్లాపూర్, చౌటబెట్ల, బొల్లారం, యాపట్ల గ్రామాలకు చెందిన పలువురికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి కంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన అభివృద్ధే అధికమన్నారు. త్వరలోనే 167కే జాతీయ రహదారి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ హనుమనాయక్, ఎంపీడీఓ చెన్నమ్మ, తహసీల్దార్ శివ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీలు బోజ్యానాయక్, కమలేశ్వర్‌రావు, దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, చంద్రయ్యయాదవ్, కలమూరి నిరంజన్, గాలియాదవ్ తదితరులున్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లికి చెందిన ఈశ్వరమ్మకు రూ.20 వేలు, గోపాల్‌కు రూ.16 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధర్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు.